Reg. No. M. 2580

సం॥ చందా రు ౪ లు.

# జమీన్ రైతు

జమీందారీ రయితుల ఆర్థిక సాంఘిక వ్యవసాయిక భాగ్యోదయమునకు

సంపుటము ౨ } శనివారము ౨౧—౧—33 నెల్లూరు } సంచిక ౨౦

## లంచాల దోపిడి.

వెంకటగిరి జమీందారీ, కొవ్వూర్ల కోటలో 1336, 1339 ఫసలీలలో రు4000-లు రిమీషన్ యిచ్చిరి. యిందుకు అధికార్లు లంచములు రు 1000-లకు మొదటి ఫసలీకి అప్పుడే చెల్లించు కొనిరి. 1339ఫసలీలంచములు యిప్పుడు వసూలు అగుచున్నవి.

బసిరెడ్డి పల్లెరైతు, గొంది పిచ్చిరెడ్డి తనవంతు 28 శేరీన రు60-0-0లు సిస్తుకట్టగా రు 49-లకు రశీదుయిచ్చిరి. తక్కిన మొత్తము సన్న 1339ఫసలీకి లంచము క్రింద మినహాయించు కొనిరట.

ఈగ్రామములో 300 పడకల సేద్యము కద్దు. ప్రతి సం॥ కరణముకు రు. 300 లు రివిన్యూయిన్‌స్పెక్టరుకు రు. 150 లు లంచముల క్రింద సమర్పింతురట. ఇట్లుఇతర గ్రామములలోను మామూళ్లుకలవు. చెరువులు మరామత్తులులేక పంటలు పండక రైతులు పూర్తిగాదరిద్రులైయున్నారు. చెరువు కాని ఆమాయక రైతులనుండి, ఉద్యోగులు బాధలు పెట్టి లంచాల క్రింద యెంతో ధనము కొల్లగొట్టి బడుచున్నది.

అతిస్వల్ప వేతనములు గల ఎస్టేటు ద్యోగులకు ఆరు మాసముల కొకమారు జీతముల నివ్వక అల్లాడించుచూ, లక్షలాది ధనమును ఎన్నికల క్రింద ధారబోయుచు, లైసన్సులుపొందినఉద్యోగులు గ్రామముల మీద లంచాల దోపిడి చేయించుచుండగా ఉదాసీనమువహించినది. చాలకట్టిఅధికారుల చేతాలా బోర్డుప్రెసిడెంట్ల కేసుమని మురియుటసిగ్గులచేటు.

## జూపల్లి వెంకటరామారావు గారి లంచాలు.

(వీరుఅంత్యమయ్యెడు జిల్లాబోర్డు వైస్‌ప్రెసిడెంటుగను, ప్రెసిడెంటుగను వున్నారు.)

వీరు 5, 6 సంవత్సరములకు ముందు వెంకటగిరి తాలూకాలో ఎస్టేటు తహసీలుదారుగా నున్నారు. కారణాంతరములచేత ఆ యుద్యోగమునుండి విముక్తి కావింపబడిరి. వీరు మొన్నటి ఎన్నికలలో జిల్లాబోర్డు అభ్యర్థిగా నిలువబడిరి. వీరికి రయితులు ఓట్లివ్వలేదని రయితులపై యెస్టేటువారు విరోధము జూపుచున్నారు. వీరు తహసీలు దారుగా యున్నప్పుడు రయితుల నెవ్విధమున పీల్చినదియు ఎస్టేటువారికి తెలియుటకై కొన్ని సాదృశ్యములనిటు జూపుచున్నాము.

కొన్ని లంచాలవివరములు.

1. వెంబులూరు గ్రామస్థుల వద్ద తమకు, దేవులపల్లెకు గల కంచె ఎల్ల తకరారు సందర్భమున తీసుకొన్నది 450-0-0
   చెఱువు రిపేరు చేయించుటకు తీసుకొన్నది 340-0-0
2. తిర్గంపాడు గ్రామస్థుల వద్ద సన్న 1338 ఫసలీ సుక్తి, బంజర్ల ముజరాల సందర్భమున తీసుకొన్నది. 200-0-0
   చెఱువు రిపేరు సందర్భమున తీసుకొన్నది. 180-0-0
3. దేవులపల్లె గ్రామస్థుల వద్ద చెఱువు మరామత్తు సందర్భమునను, కిస్తుల వసూలు సందర్భమునను తీసుకొన్నది. 100-0-0
4. చాపలపల్లి గ్రామస్థుల వద్ద సన్న 1338 ఫసలి సుక్తి, బంజరు, రిమీషనుకుగా తీసుకొన్నది. 100-0-0
5. దక్కిలి గ్రామస్థులవద్ద సన్న 1338 ఫసలి సుక్తి, బంజరు రిమీషను కొరకుతీసుకొన్నది. 100-0-0
6. పలుగోడు గ్రామస్థుల వద్ద వాకనెట్టు సుక్తి, రిమీషను సందర్భమున తీసుకొన్నది. 40-0-0

ఇట్లె యెన్నియో సాదృశ్యములు గలవు. సన్న 1338 ఫసలీ సుక్తి, బంజరు రిమీషను సందర్భమున అన్ని గ్రామముల నుండియు ఇట్లేగుంజబడినది.

"ఒకరైతు."

---

కుమారరాజాగారి హృదయమున దయయునది గలిగియున్నచో యితర పాలిటిక్సు వదలు కొని వెంటనే జమీందారీ నంతయు తన స్వంతకార్యాలలో తొక్కి స్వంత కళ్ళతో చూచి, జరిగినఉదాసీనతకు చేసినపాపమునకు, పశ్చాత్తాపపడి ఇంకనైనను తనకు ముప్పూటా భోజనమిచ్చి, కటికపస్తులతో కడుపులు మాడ్చుకొనుచున్న పేదకుటీరముల నొకసారి పరీక్షించి, కన్నీటి బొట్టులతోనైనను వారి దరిద్రదేవతనారాధించి, నొచ్చిన ప్రజల హృదయముల చూరగొందురుగాక.

ఇవియే నాయశ్రుపూరిత నీరాజనములు,

"పేద రయితు."

## ఊహాగానము.

(విమర్శకుడు.)

"చింతకాయలకొజ్జయితే గుటుకలకు కూడా ఆజ్ఞేనా?" మెంబర్లు రేపుప్రొద్దునఎవరినెన్నుకొన్నా మంచికోర్కెలైనా కోరకూడదా యని నామటుకు నేనే ఊహాగానం చేస్తున్నా.

### ప్రెసిడెంట్లవరు?

జిల్లాబోర్డు మాటను కొందాం. జిల్లాలో పబ్లికు పార్టీ అనేది ఒకటి లేనప్పుడు స్వార్థపరులు యెందుకు దూరకోరు? అయ్యవార్ని చెయిబోతే కోతైందన్నట్టు పంతులగారి పాలన తప్పించి మంచి పాలన పెట్టాలను కొన్నందుకు అధోగతికి పోయింది. తమ యెస్టేట్లను చక్కబెట్టుకోలేక రయితులను పలువు విస్సేసి కేశంమీద తిరముతుండే జమీందార్లను జిల్లాబోర్డు పెత్తనం చెయమనడం దేశ దౌర్భాగ్యం గాక మరేమిటి? స్వార్థ పరులగు మెంబర్లు స్వలాభాలకు ప్రజలను గోతిలో తొయ్యడం యెంతో కాలం సాగదు. కుయి కుయి మంటున్న గోవిందన్నకు వైస్ ప్రెసిడెంటు పని దానంచేస్తామనే సరికి కాళ్ళు చేతులు చల్లబడి కడపదాటడం మెలిగించాడు. యీ యెత్తులో యిక ముందు గోవిందన్నకు పబ్లికు పలుకుబడి తీసేశారన్నమాట. వైస్ ప్రెసిడెంటు పనికి వీరొప్పుకోవడం ఆ పార్టీ లీడర్లకు పాలుబోసినట్టు. లేకుంటే చిల్లర నాయకులంతా తలకాయలు బట్టుకొని చిందర వందరయ్యే వాళ్లు.

ఓడినా, గెలిచినా వెంకటసుబ్బారెడ్డిగారు మాత్రం చివర వరకు పోటీ చెయిడం బాగు. ప్రజాపక్షం సగానికి సగమున్నప్పుడు అధైర్య మెందుకు?

### తాలూకాబోర్డులు.

### సూళ్ళూరుపేట.

ఈ బోర్డు ప్రత్యేకంగా చీల్చవద్దని రాజాగారు గీచిన గీటును దాటి ప్రత్యేకం చెయ్యమని పోట్లాడిన రయితుసంఘాభ్యర్థి వెంకట నారాయణ రెడ్డికంటె స్వార్థత్యాగిని సంపాదించడంకష్టం. జమీందారీరయితు సంఘమొకటుండంటె యీలాంటి యువకుల కృషివల్లనేగా. కాబట్టి సభ్యులు దీర్ఘాలోచన చేసి యితన్నే వరిస్తే దేముడు మెచ్చుతాడు.

### వెంకటగిరి.

ఈబోర్డులో అరిటు, అరటు. బోర్డుసంఘం చేతులలోకొస్తే ఆదర్శప్రాయంగా చెయ్యాలనే తంటాలు పడుతున్నారు, సంఘంవారు. భగవంతుడి క్యాస్టింగు ఓటిస్తే తప్పకరయితుపార్టీకి గలసది. రాజాగారు ఖజాంచీని ప్రెసిడెంటును చేస్తారట సాగితే. జూపల్లివారు యీజోలి మానుకొన్నారట.

### రాపూరు.

కొత్తమైకారక్షకులకు, పాతపాగాయకర్షకులకు పోటీపడ్డది. ప్రెసిడెంటు అప్పడి చేతికే రావాలంటె చెంచునరసింహంగారి పేరే ముందుకొస్తది.

### గూడూరు.

స్వయంకృతాపరాధంచేత యీబోర్డు తారుమారయింది. ఎవరుప్రెసిడెంటవుతారో చెప్పలేము. ఓపిక, తీరికవుండే చెలపతిరావయినా కొంత నిర్వహించగలడేమో?

### నెల్లూరు.

ఈబోర్డుకు, బిడ్డపుట్టకముందె పెండ్లినిర్ణయమయినట్టు యెలెక్షనుకుముందే ప్రెసిడెంటు నిర్ణయమయింది. అయినాఒకమాట. అహంకారకు ధనధాన్యాదులు అడ్డురాకపోతే పాణకాట్టాభిరామిరెడ్డి అధ్యక్షుడయి లేబాగుంటుందేమో? నావూహకు మెంబర్ల నిర్ణయమడ్డురాదనుకుంటా.

### ఉదయగిరి.

అప్పలుంటె, చెంచయ్య నాయుడుగారికి కొంతవిశ్రాంతి ప్రసాదిస్తేయేమి? పాపం యెంత కాలం ఒక్కరే పాపపుణ్యా లనుభవిస్తారు? వీలుంటే చూడండిమరి.

### ఆత్మకూరు.

బోర్డుచీలడంతోటే సభ్యులుగూడాక్రొత్త. ప్రెసిడెంటంటే యింట్లోకూర్చొని బత్తానాకడం కాదు. సంఘసేవచేసి ప్రజలవద్ద సర్టిఫికేటుపొందాలె. ఆలాంటివార్ని జూచియెన్నుకొంటె యీబోర్డుగూడ గణనకొస్తది.

### కనిగిరి.

కాన్షన్సునుకట్టిపెట్టి క్రిమినలాక్రిమినలన్నిటిలో కాలుపెట్టి, సంపాదించిన గౌరవమర్యాదలకు తిలోదకమిస్తున్నా, తాలూకాబోర్డులో చేసి చూపెట్టిన యితని కలాన్ని కాదనడానికి వీలులేదు. జిల్లాబోర్డు యెట్లున్నా తాలూకాబోర్డయినా వీరిచేతినుండి తప్పించడం బాగులేదు.

### కందుకూరు.

వెంకటకృష్ణారెడ్డిగారికి పూలమాల వేయనున్న బోర్డు, అస్వాభావికముగా నాయుడుగారినే వరించాలంటె కటువుగానేయుంది. కాని కాలవైపరీత్యం కాదనటానికుందా?

### కావలి.

తిరుగా హరిశ్చంద్రారెడ్డిగారి పాదముల పై పడనున్న యీబోర్డు సంగతట్లుంచి, రాజానే అధ్యక్షుణ్ణిచెయ్యాలనే పట్టుదల యీరెడ్డిగారికెందుకు? దొంగలు దొంగలు పూళ్ళుపంచుకొంటె దేశస్థితెట్లుగావలె?

## మోపూరు ప్రోనోట్ల కేసు.

—o—

నెల్లూరు మునసబ్ కోర్టులో వెంకటగిరి మహారాజాగారి రెండవ కుమారుని సాక్ష్యముకై 17-1-33 ది వాయిదా వేయబడి యుండిన మోపూరు ప్రోనోట్లు కేసు, రెండవ రాజకుమారుడుగారు గవర్నరు పిలుపించగా ఆతేదినసే మాట్లాడుటకు పోవుచున్నారుగాన తిరుగా ఆకేసు 10-2-33 కు వాయిదా వేయబడినది.

## వెంకటగిరి సబ్ మాజిస్ట్రేటు గారి మార్పు.

—o—

వెంకటగిరిలో గత 4 సం॥గా యుండిన సబ్ మాజిస్ట్రేటు గారైన శ్రీ జగన్నాథనాయుడు గారిని సూలూరుపేటకు మార్చి వారి స్థానమున సూలూరుపేట సబ్ మాజిస్ట్రేటు గారైన శ్రీ టి. షణ్ముగం మొదలియార్ గారిని వేసినట్లు తెలియుచున్నది.

### కోవూరు.

యీబోర్డు ప్రెసిడెంటు యెలెక్షను నెల్లూరు ట్రింకురోడ్డులో తీర్మానమయింది. రేబాలగోపాలరెడ్డిగారిని అధ్యక్షులుగను, శ్రీమతి కొండానరసమ్మ గారిని ఉపాధ్యక్షులుగను యేకగ్రీవంగా యెన్నుకొన్నారట. లేకలేక రేబాల వారికుటుంబానికి దక్కిన యీగౌరవానికి అందరు అభిలషించాలసిందే!

### పొదిలె.

"అన్యాయపురి పట్టణంలో అలుకొడితే మొగుడేడవ దోషం" అన్నట్లు యీబోర్డుకు పేష్కారును అధ్యక్షుణ్ణిజేస్తారట కింగ్ మేకరు మాత్ర కొండారెడ్డిగారు. వీరినిమూడేండ్లు యిక్కట్టుంచి మార్పు రాకుండా చెయ్యాలన్న పన్నుగడ. రెడ్డిగారు యుక్తాయుక్తంతలోచించా దంటే వెంకటేశ్వరశర్మను ప్రెసిడెంటును చేస్తేకొంత గుడ్డిలో మెల్లశ్రేష్టం.

### దర్శి.

నిరక్షరకుక్షులకు యీఅధ్యక్షత అంటగట్టాలని వివాదగ్రస్తంలో ఉన్నదట. దీనికిరెడ్డిగారే దక్షులు. ముందురెడ్డిగారు కొన్నిలువాకిలి తొక్కాలంటెయీనాడు సంఘాన్ని వీరు గోతిలోదోస్తే రేపు వీన్ని సంఘంగోతిలో తొయ్యదా!

# వెంకటగిరి యెస్టేటు రైతుల కొక విన్నపము.

బొమ్మినేని నారాయణస్వామినాయుడు, తిరుత్తని జమీన్ రయితు మహాజన సంఘ ప్రచారకుడు.

మనమో మనపూర్వులో చేసినపాపములకు ప్రతిఫలముగా సర్వేశ్వరుడు జమీన్ రయితులుగా మనలసృష్టించెను. పాపఫలమనుభవింపక తీరదు. అనేక శతాబ్దములుగా అనుభవించితిమి. ఇంక నెన్నాళ్ళనుభవింప గలము. పరమేశ్వరుడు మనయందు జాలి కలిగి కాబోలు నూతన సంస్కరణముల ప్రభుత్వము ద్వారా రయితుల కొసంగజేసెను. అమ్మవారు వరమిచ్చినను పూజారి వరమివ్వడను సామెత ననుసరించి జమీన్ దారులు మనల స్థానికసంస్థలలోగూడ చోరనీక తామే తాలూకా, జిల్లా, కౌన్సిల్, అసెంబ్లి మున్నగుస్థానముల నాక్రమించుకొని ముందటికన్నగు నధికముగా మనలచెరుపజూచుచున్నారు. వీరికిగల యెస్టేటులను స్వయముగా పరిపాలింపక తాబేదారుల వశమొనర్చి ప్రజలు తమకుచెల్లించెటి ద్రవ్యమును పట్టణములందు ఖర్చిడి భోగలాలసత్వమున నోలలాడుచున్న జమీన్దారులు స్థానిక సంస్థలకు పోటీజేసి యాక్రమించుకొనుట యందెంతయర్థమిమిడియున్నదో యూహింపవలసియున్నది. రయితులన్న వీరిదృష్టియందు మానవులుగా దోచుటలేదు కాబోలు? రయితు భాగ్యము వీరికి కంటక ప్రాయము. రయితుకు స్వాతంత్ర్యేచ్ఛ కలిగినచో దానినణగద్రొక్క జూచుదురు. రయితు సంఘములన్న తీరని యాగ్రహము. ఏమీ యన్యాయము? దిక్కులేని యీ బీద రయితుల బోధించుటకు విద్యావంతులు స్వార్థత్యాగులై యుండినగదా ముందుకు వత్తురు? ఒక రిద్దరు ముందుకు వచ్చినను వారిని యుద్యోగము, ధనము, మున్నగువానితోడనో, లేక భయపరచియో లోబరచికొనియెదరు. కాబట్టి రయితు సోదరులారా! మనకు దిక్కులేదు మనము స్వశక్తిమీదనే నాధార పడవలెను. ప్రథమమున కష్టలు బారద్రోలి మనలోనున్న ప్రజ్ఞావంతులగు సోదరుల స్థానిక సంస్థలకు మనవోట్లనిచ్చి పంపిన కొంతవరకు మేలు చేకూరగలదు. సర్వదా మన కపకారంబుల సేయుటయే తమ పరమావధిగా నెంచియుండు జమీన్దారులకు మనవోట్లనిచ్చి పరిపాలన వారికప్పగించి వారి నిరంకుశ చర్యలచే మనము కుంగి కృశించుటకన్న మనమే యాస్థానముల చేకొనుటలో నెంత మేలుగలదో యోచింపుడు. కావున నోసోదరులారా!

"ఓటుహక్కు గుర్తించరా-యో
మోటములకు లొంగిపోకురా-భూ
స్వాముల మాయల బడకురా-నీ
ప్రతినిధు లెవ్వరో తెలియరా-రైతు
రాజ్యమునకు బాటడీయరా"
"శాసన సభలను మాడరా-రైతు
సంఘము తరపున వీరెరా-మన
సభ్యులుగా నున్నారురా-మన
కపకారంబుల సేయరా-యెదు
రొడ్డి కూరుచున్నారురా" (కడగండ్లు)

అను గేయముల ననుసరించి భూస్వాములు లాంచనములకును, లంచములకును, ఉద్యోగములకును, లొంగక, రయితు సోదరులును రయితు సంఘాభిమానులును అగు నాయకులకే మీ వోట్ల నొసగి సంఘాభిమానమును ప్రకటింపుడు. భూస్వాములకు, వారి వకీళ్లు, వారియుద్యోగులు వీర్లకు, మీ వోట్ల నొసగుటకంటె యాత్మహత్యయే మేలని నాయనవి. మీకీయంశములు తెలియకున్న తిరుపతి దేవస్థానము యెస్టేటు రయితుల జూచియైనను నేర్చుకొనుడు. తిరుత్తని జమీన్ రయితు సంఘమువారును, నారాయణ వనం తాలూకా రయితు సంఘమువారును గత నవంబరు తే 15 ది ఎన్నికలలో పుత్తూరు తాలూకాబోర్డు 16 మంది సభ్యులలో 15 మందిని రయితు సంఘ నాయకులనే యెన్నుకొనిరి. తిరుపతి తాలూకాబోర్డుకు 16 సభ్యులకు 16 మంది రయితు సంఘ నాయకులనే యెన్నుకొనిరి. చిత్తూరు జిల్లాబోర్డు సభ్యత్వమునకు రెండు తాలూకాలలోను 12 స్థానములకు 12 గురు రైతు సంఘ నాయకులనే యెన్నుకొనిరి. మరియు, తిరుత్తని తాలూకా రయితు సంఘాధ్యక్షుడగు శ్రీ మునిరత్నంనాయుడుగారు తిరుత్తని తాలూకా అధ్యక్షుడుగాను, పుత్తూరు తాలూకాబోర్డుకు నారాయణవనం తాలూకా రయితు సంఘాధ్యక్షులు రా॥ బ॥ కె. వెంకటాద్రినాయుడుగారు అధ్యక్షులుగాను, రయితు సంఘ కార్యదర్శి వైస్ ప్రెసిడెంటుగాను యెన్నుకొనబడిరి. (జమీన్ రయితు మహాజన కేంద్రసంఘసంయుక్త కార్యదర్శులును, సంఘస్థాపకులైన శ్రీయుతులు దావుభూరు ముని కన్నయ్య నాయుడుగారున్ను శ్రీ గుండారెడ్డి రంగయ్యరెడ్డిగారున్ను జిల్లాబోర్డుకు ఎన్నుకొనబడిరి. ఇందువలన రయితులు ఏకమత్యతయు, సంఘాభిమానమును యెట్లు వెల్లడియగుచున్నదో యోచించి మీరును రయితు సంఘనాయకులనే తాలూకా జిల్లా బోర్డులకు మీ ప్రతినిధులుగా నెన్నుకొని రయితుల గౌరవము నినుమడింపజేయవలెననియు, భూస్వాములచే కల్పింపబడు మాయోపాయములకు తాత్కాలిక లాభములకు నాశించి రయితుల గౌరవమును చెడగొట్టక కాపాడవలెననియు, మీ పాదములకుసాష్టాంగ నమస్కృతులొనర్చి ప్రార్థించుచున్నాడను.

—o—

## మారినది.

జమీందారీరయితు పత్రిక కార్యాలయం గాంధిచౌకునుండి రాయజీవీధిలోని నె 847 నం యింటిలోనికి (స్త్రీభాత ముద్రణాలయమునకు యెదుట) మార్చబడినది.

మేనేజరు.

జమీందారీ రైతు

శనివారము.

౨౧—౧—33.

## అధ్యక్షుడెవ్వడు?

—o—

నెల్లూరు జిల్లాబోర్డు అనధికారాధ్యక్షుల స్వాధీనమయినది మొదలు 12సంవత్సరములు యేకరీతిగా ఆమంచర్ల సుబ్బకృష్ణరావు పంతులువారి పరిపాలన సాగినది. వీరిపాలనఅతిచతురతగను, సమర్ధతగను, చక్కగను సాగినది. పంతులువారి అశ్రితులు సంపాదించిన కళంకము పంతులవారి ప్రతిపక్షులకు చేయూతనొసగి వారి చేతినుండి బోర్డును తొలగింప సాధనమయినది.

అట్టిరవిసౌరభము తెలియుటకవకాశములేని అవికసితమగు రెడ్డిగారిభావకుసుమమునకు ముగ్ధనెల్లూ ప్రజలకు రామచంద్రారెడ్డిగారిఅచిర పాలనమే జిల్లాప్రజలకు యేవగింపుగల్గించుట విషాదకరము. రెడ్డిగారి శాసనసభా వృత్తాంతము మరింత ప్రజల మనస్సుల కలవర పెట్టినది. స్వార్థపరత్వమునకు గడ్డగట్టిన రెడ్డిగారి పక్షనిర్ణయము లెట్టివారిని యేవగింపునకు పురికొల్పవు?

కుమారరాజాగారికి మంత్రి పదవి అలభ్యమగుటతో జిల్లాబోర్డు అధ్యక్షపదవి నాక్రమింప సంకల్పించి రెడ్డిగారిని శాసనసభాధ్యక్ష పీఠం నెక్కించిరి. అంతకుముందు శాసనసభా యెన్నికలపుడు "పంతులవారిని శాసనసభకు పంపినచో యెన్నుకొన్న రయితుగణమును వదలి రు 2000/- జీతమున కాసించి శాసనసభాధ్యక్షతపదవిని స్వీకరించును. రెడ్డిగారివంటివారు అట్టి ఆశలనొందర"ని కరపత్రముల బంధి పెట్టించి రయితుల కభయహస్తమిచ్చిన రెడ్డిగారు అవకాశము దొరికినంతనే స్వవచన వ్యాఘాతమునకు వెరువక వెంటనే అధ్యక్ష పీఠము నలంకరించిరి.

రెడ్డిగారు శాసనసభాధ్యక్షులయిన వెంటనే కుమారరాజాగారు జిల్లాబోర్డు ప్రెసిడెంటు పదవిని స్వీకరించి, జమీందారు పక్షమంత్రోద్యోగములు ప్రోత్సహించి తన క్రింది యెస్టేటుద్యోగియగు వైస్ప్రెసిడెంటు గారికి పరిపాలనా భారమును సమర్పించిరి. కుమారరాజాగారు బోర్డును స్వాధీనము చేసుకొన్న 2½ సం॥ కుగా యేకొన్ని గంటలో జిల్లాబోర్డు మేడపయి విడిసి యుండరు. కార్యక్రమమంతయు వైస్ప్రెసిడెంటుగారి చేతిమీదనే జరిగిపోవుచుండెను. ఈదృశ్యము కలలోనయినను స్మరింపని బోర్డుమెంబర్లకెట్లున్నను జిల్లాప్రజలకు తీరని తలవంపుల కలిగించుచున్నది. సరియగు దక్షతలేక చిన్నాభిన్నముగనుండు తన జమీనును చక్కబెట్టుకొనజాలక యెస్టేటు వారికిని, రయితులకును, దినదినము పొరపులు హెచ్చుచుండ్రివ పరిస్థితు లెదుర్కొన నున్నపుడు సయితముతానుమధ్యపడనవలె వదలి, దేశాంతరగతులై యుండు యువరాజాగారు, యెట్టిగతి బట్టిపోయినను బాధ్యతలేని జిల్లాబోర్డు పాలనకై వీరు శ్రద్ధవహించ లేదనుట పొరపాటుమాట.

రౌండుటేబిలు కోట్ సైడ్ విజిటరుగ ఇంగ్లాండు, ఫ్రాన్సుదేశముల పర్యటనమునందు కొంతకాలమును, జమీందారుల భావిరక్షణ కార్యాదికములకై మదరాసునందు కొంతకాలము గడుపు వీరుబోర్డు పరిపాలనా బాధ్యత నెట్లునిర్వహించగలరు? బోర్డుపరిపాలనయందు వీరికిగల బాధ్యత, సభలకు సయితము హాజరుగాక సభ్యత్వమును, ప్రెసిడెంటుపదవిని గోల్పోవుటయే నిరూపించుచున్నది.

ఇదిగతచరిత్ర. నేడుకొత్త మెంబర్ల యెన్నికలు జరిగినవి. 52మందిసభ్యులు పలుప్రాంతములనుండి సరాసరి యెన్నుకొనబడిరి. ఫిబ్రవరి 9-వ తేదిన అధ్యక్ష ఎన్నికలు జరుగనున్నవి. ఈ సింహాసనము నలంకరించుటకు యిద్దరు ముగ్గురు ప్రయత్నపడుచున్నారు. వీరిలో కుమారరాజాగారొకరు. వీరికితిరుగా పట్నముగట్టుటకు మద్రాసునుండి విష్వాక్షికముగా నుండవసిన ప్రెసిడెంటు రామచంద్రారెడ్డిగారు పదిదినములుగా వచ్చినెల్లూరునందు విడిదిచేసి పట్టాభిషేకమున కవసర భాండారమును చేకూర్చుచున్నారు. యెన్నియో తంత్రములు, యెన్నియోమంత్రములు, యెన్నియోవరములు, ప్రయోగింప బడుచున్నవి. కుమారరాజాగారికి పోటీకి నిలువనున్న వారిలో నొకరగు గోవిందరెడ్డిగారికి మంత్రప్రయోగము ప్రారంభమైనది. రెడ్డిగారు పోటీమానుకొన్న ఉపాధ్యక్ష పదవి దత్తము చేయబడునని యాహ్వానించిరి. ఈ పిలుపు రెడ్డిగారిని ఆనందవార్ధి నోలలాడించినది. రేపటిస్థితి యెట్లుండునో చేజిక్కినది జారవిడువనేలనని అర్థాంగీకారమిచ్చిరి. రెడ్డిగారికీతన స్వబలమునందే అపనమ్మకము బుట్టించిరి. కేవలముదయాపూర్వకముగాప్రసాదించువరమని బెదరు బెట్టిరి. రెడ్డిగారు డంగైపోయిరి. కాని రెడ్డిగారికి ప్రజాపక్షబలమునుండుట నెరిగియే వీరిని ప్రజాపక్షమునుండి చీలదీసి వీరిపలుకుబడిని శాశ్వితముగా చెడుపయత్నించిరి. రెడ్డిగారు వెనుకటి మాటుగూడ పప్పులోకాలువేసి మండలదుర్గతికి కారకులయిరి. వీరి స్థితియిట్లున్నది.

పెళ్లేటి వెంకటసుబ్బారెడ్డిగారు మాత్రము కుమారరాజాగారితో పోటీచేయు

టకు సంసిద్ధముగ నున్నారు. సుండలీయులకు వెంకటసుబ్బారెడ్డిగారు క్రొత్తవారుగారు. వెనుక గూడూరు తాలూకాబోర్డు అధ్యక్షులుగానుండి వీరు చేసినసేవ అనుపమానము. న్యాయపక్షమునకు దక్క యితరపక్షములకు లొంగకుండుటలో వీరొక్కరే యీజిల్లానాయకులలో అగ్రగణ్యులు. గూడూరు తాలూకాబోర్డులో యింతవరకు పొరపొచ్చ్యలేకుండా నిష్పాక్షికముగాపరిపాలించిరి. ప్రాణస్నేహితునికి సయితము పరిపాలనలో పక్షపాతము చూపి యెరుగని వీరిసుగుణరాజము వర్ణనాతీతము. వీరినిష్పక్షపాతబుద్ధి కొందరు స్వార్థపరులకు రుచించక పోవుటలో చిత్రములేదు. ఒకమాటు రెడ్డిగారి న్యాయపక్షత జిల్లాబోర్డుయందు రుచిజూపినచో చిల్లగింజచేత కలుషోదకము తేరినట్లు కంట్రాక్టరుల స్వార్థకల్మషము గడిగివేయబడి భావిభాగ్యతకు దారిజూపగలదు.

మెంబర్లకు పరీక్షాదినము చేరుచున్నది. తామునోరులేని ప్రజల పక్షమున యెన్నుకోబడితిమనియు, జిల్లాబోర్డు ధనము అరులక్షలపై తమకు పెత్తనమున్నదనియు, జిల్లాలో చాలాభాగము విద్యావిహీనతగానున్నదనియు, మలేరియాబాధ ననుభవించు ప్రాంతములు కొన్నిగలవనియు, దారిడొంకలు లేనిగ్రామాదుల సంఖ్య అపారమనియు, వీటికన్నిటికి తగిన రక్షణోపాయము వెదుకవలసిన బాధ్యత తమకున్నదనియు, గమనించినచో యిట్టికార్యనిర్వహణమునకు అజస్రముపాటుబడగల స్వార్థత్యాగిని అధ్యక్షుడుగా నెన్నుకొనవలసిన అవసరమున్నదని బోధపడగలదు. అట్లుగాక కంట్రాక్టులు లభించగలవనియు, యితర కార్యములు యిందుమూలముగా చక్కబెట్టుకొనవచ్చుననియు, స్వార్థచింత నమనస్సున నున్నచో, అట్టికార్యముల నెరవేర్పగల వారినే అధ్యక్షుడుగా వరించవలెనను దురూహ పొడమగలదు. ఈశ్వరుడు మనకు మానవజన్మనిచ్చి, సచ్చింతనలకు జ్ఞానమునిచ్చి, ఉచితానుచిత జ్ఞానమునిచ్చి యున్నాడు. అట్టిజ్ఞానమును దుర్వ్యయము చేయుచు తన చాపలపు కడుపుకొఱకు సోదరపేద మానవుల కుత్తుక కోసి రక్తపానము చేయక న్యాయమార్గమున మెలగుట ప్రతిమానవుని ధర్మము.

ముందు రాగల స్వాతంత్ర్య భానుని అరుణోదయకాంతులే యీలోకల్ బోర్డులు. దీనియందు స్వార్థచింతనమాని లోక కల్యాణమునకు పాటుపడనిచో అట్టిమానవుడు ముందురాగల సుఖకాలమున వెలిబడక మానడు. గాన జిల్లాబోర్డు సభ్యులారా! తమకు దొరకిన యీస్వల్పావకాశమును సవ్యముగా యుపయోగించి ఉచితజ్ఞుని అధ్యక్షునిగా వరించుట మీముఖ్యకర్తవ్యమైయున్నది.

జమీందారీ రయితుల పక్షము ప్రత్యేకముగా నొకమాట మనవిచేయవలసియున్నది. జమీందారులు నేడన్నిచోట్లను, అన్నిసంస్థలయందును, అన్నిస్థానములను ఆక్రమించుకొని ముందురాగల స్వాతంత్ర్య కాంతులకడ్డు దగిలిసామాన్యప్రజల జీవితముల నరికట్ట జూచుచున్నారు. ఉత్తరమున గంజాము మొదలు నెల్లూరువరకు ప్రతిచోటను జమీందారులు లోకల్ బోర్డుల ఆక్రమించుకొనుటకు ప్రయత్నించుచున్నారు. ఇదిదూరదాలోచన. యిప్పటివరకు యేవ్యవహారములందు జోక్యముపుచ్చుకొనని పిఠాపురాధీశ్వరుడుగూడా ఈ యెలక్షన్ పోటిలోదిగి నాడన్న, యీజమీందార్లయుద్యమతత్వము బోధపడగలదు. యిదంతయు జమీందారీ రయితుల నోటమట్టిగొట్టుటకు ఒకమూలశాసనసభలయందు రయితుల ప్రతినిధులమనితామే దూరుటయు, జమీందారులకు, రయితులకు వివాదగ్రస్థమగు యెస్టేటులాండు అక్టును తమకనుకూలముగ సవరించుకొనుటకు ప్రయత్నించుటయు, స్థానికముగగల లోకల్ బోర్డులు మొదలు అన్నిసంస్థలయందు తాముదూరికంట్రాక్టరు మొదలు, ఉపాధ్యాయుడువరకు అన్ని తెగలవారిపై తమపలుకుబడి సాగించుటకు ప్రయత్నించుటయు వారియుద్యమరహస్యములు.

నేటిజమీందారీరయితు, సహాకర్యములులేక యకరమును చెప్పరాని హాస్యములాటి గాగల రైతు కొంపల నాశనము చేయుశిస్తులతో, కోర్టుకర్చులతో, లంచాల దోపిడులతో, పరిపాలనా సౌలభ్యమెరుగని జమీందారు బిడ్డల పరిపాలనలతో కొంపలు కుంగదీయబడి చెప్పుకొనుటకు సయితము నోరులేకుండా చేయబడి నరకకూపము ననుభవించుచున్నాడు. గాన యీతనిస్థితి గవర్నమెంటు రయితు తోపాటయినను కలుగచేయవలెనన్న జమీందారీరయితు ఉద్యమమును అభిమానించి, అతని కన్నీరు తుడిచి, ధైర్యముచెప్పి అనుసరించవలసి యున్నది. జమీందార్లొక్కడు. ప్రజలులక్షలాదిగలరు. జమీందారి రయితుపై జాలిగలిగిన, జమీందారు బాధలనుండి తనతోటి రయితునుఓదార్చవలెనన్న, రయితుజాతికే వేరుపురుగగు జమీందారుని యేప్రజాసంస్థకు రాకుండ చేయుటయే! ఈమూలమంత్రమును జపించి కార్యాచరణమున జమీందారీరయితుతో చేతులుగలిపిన యెడల ముందురాగల స్వతంత్రోదయమున సయితము, రయితు కోలుకొనగలడు.

అట్టితరుణముయొక్క పూర్వరూపమే నేడు మనలనెదుర్కొన్నది. నెల్లూరుజిల్లాలో వెంకటగిరి జమీందారీలో రయితులుపడు బాధలు వర్ణనాతీతము. అట్టి నరకబాధలనుండి రయితును గట్టెక్కించదలచుకొన్న నేటి జిల్లాబోర్డు అధ్యక్ష యెన్నికలలో జమీందారుని యెన్నుకొనక రయితు లోకమునకు నిలబెట్టుట సభ్యులకని సధర్మము. తామొకమాటు వెంకటగిరి పల్లెలకరుదెంచి కష్టపరంపరల మునుగుచున్న రయితులోకమును జూచిన సభ్యులకు తమ విధ్యుక్తధర్మము బోధపడకమానదు. 7-వ తేది మీసత్యధర్మ ప

రాయణులకు మెరుగుపెట్టు శుభదినములో? స్వార్థ పంకిలమున కశ్మలమై పోవుచున్న దినములో? రానున్నవని చరిత్రకారులు వ్రాయనున్నారు.

## కనకమ్మగారి ఆరోగ్యము.

శ్రీమతి పొణకా కనకమ్మగారి ఆరోగ్యము కొంత చక్కబడుచున్నదని వినుటకు సంతసించుచున్నాము జ్వరమునిమ్మళించినదనియు, ఇంకను దినమునకు రెండు మూడు పర్యాయములు విరేచనములుమాత్రమగుచున్నవనియు, బలహీనముమాత్రము వదలలేదనియు తెలియుచున్నది. ఆమెగారింకను పెంట్లూరు ఆసుపత్రియందే యున్నారు. వారికుటుంబమంతయు అచటనే శుశ్రూషించుచున్నది. త్వరలో ఆమెగారికి ఆరోగ్యము ప్రసాదించుగాక యని భగవంతుని ప్రార్థించుచున్నారము.

## ప్రెసిడెంట్ల ఎలెక్షనులు ఎప్పుడు?

| | |
|---|---|
| నెల్లూరు జిల్లాబోర్డు | 9-2-1933 |
| తాలూకాబోర్డులు. | |
| సూళూరుపేట | 26-1-1933 |
| వెంకటగిరి | 26-1-1933 |
| గూడూరు | 2-2-1933 |
| రాపూరు | 2-2-1933 |
| నెల్లూరు | 2-2-1933 |
| కోవూరు | 22-1-1933 |
| ఆత్మకూరు | 2-2-1933 |
| ఉదయగిరి | 2-2-1933 |
| కావలి | 2-2-1933 |
| కందుకూరు | 23-1-1933 |
| కనిగిరి | 22-1-1933 |
| పొదిలి | 22-1-1933 |
| దర్శి | 22-1-1933 |

## హెల్తు ఆఫీసర్లు-స్థానిక సంస్థలు.

చట్ట ప్రకారము ప్రజాహితైక కార్యములు హెల్తు ఆఫీసర్లు చేయుగ స్థానిక సంఘములు వారి సలహాలను సహకారమును స్వీకరించి తమ యిష్టానుసారము కొందరు వ్యక్తులను తృప్తిపరుప జూచుట మనము తరుచుగ పత్రికలయందు గాంచుచున్నారము.

హెల్తు ఆఫీసర్లు స్థానిక సంస్థల విశ్వాసమును, అభిమానమును సంపాదింప కోరినచో, ఆరోగ్య పద్ధతులకు విలోకనములిచ్చి, చట్ట విరుద్ధముగ ప్రవర్తించవలసి వున్నది. ప్రజల ఆరోగ్యాభివృద్ధి గాంచుటకు చట్ట ప్రకారము తమ విధుల నెరవేర్చినచో, స్థానిక సంస్థల విశ్వాసమును కోల్పోవవలసి వున్నది.

ఈ సంపూర్ణ శాసనసభ సభ్యులు, విద్యావంతులని మరియువారి అధ్యక్షత వహించిన నెల్లూరు పురపాలక సంఘమునందుండుట, చాల విషాదకరము. ఒకప్పుడు నెల్లూరు నందు స్ఫోటక బాధ యెక్కువగానుండుటచే, కవున్సిలువారు హెల్తు ఆఫీసరువారి సలహా నామోదించి నాటకములు సినిమాలు ఒకనెల రోజులుండకూడదని నిషేధపు తీర్మానము గావించిరి.

మరల కొలది రోజులలోగానే, స్ఫోటక బాధ హెచ్చయి, మరణములు గూడ అధికమగుచుండ, హెల్తు ఆఫీసరుగారి సలహానుగాని, వారి రిపోర్టును గాని కోరకయే, కొందరు వ్యక్తులను తృప్తిపరుప నిషేధపు టాజ్ఞను తొలగించిరి.

మరొక సమయమున ఇండస్ట్రియల్ ఏరియాలో చేరని ప్రదేశమున రైసుమిల్లు నిర్మించుటకు వుత్తర్వుకోర బడగా, యిండస్ట్రియల్ ఏరియాలో చేరనందు వలన చట్ట ప్రకారము లైసెన్సు నివ్వరాదని హెల్తు ఆఫీసరు గారు వ్రాయగా, కవున్సిలువారు వారిసలహాలను త్రోసిపుచ్చి, ఒక వ్యక్తిని తృప్తిపొందించుటకై లైసెన్సును యివ్వవచ్చునని తీర్మానించిరి. కవున్సిలువారి తీర్మానము చట్ట విరుద్ధము గాన దానిని రద్దుపరుప వలయునని హెల్తు ఆఫీసరుగారు కలెక్టరుగారికిని, పబ్లికు హెల్తు డైరక్టరుగారికిని వ్రాయవలసి వచ్చెను.

ఇటుల స్థానిక సంస్థలు ప్రవర్తించుటచే హెల్తు ఆఫీసర్ల గౌరవములకు భంగము కలిగి, వారు తమ విధులను తృప్తికరముగ నెరవేర్చుటకు వుత్సాహ రహితులగుదురు. ప్రజాక్షేమమును మన్నకలిపి, వ్యక్తుల లాభములను పోషింప జూచుటచే కలుగు అనర్థములు పురపాలక సంఘములకు తోచుటలేదు. వీరిటుల అక్రమముగ చేయుటచేతనే నగరా కొద్దికొద్దిగ వీరి తోకలు కోయబడుట. చాలభాగము యిప్పటికే వీరి వద్ద నుండి అధికారములు లాగివేయబడినవి. కొలది రోజులలోనే కమీషనర్లను నియమింప బోవుచున్నారు. అప్పుడు స్థానిక సంస్థల ఆటలు సాగుటకు వీలుండదు.

కాన వివేకముతో ప్రవర్తించి ఆరోగ్యమునకు బాధ్యులైన హెల్తు ఆఫీసరుల సలహాలను స్వీకరించకయు, వ్యక్తుల లాభములకై ప్రజారోగ్యమునకు భంగము వాటిల్లకయు ప్రవర్తించుట శ్రేయోదాయకము.

పాపము శాంతించుగాక,

సత్యవాది.

## ఒక జమీందారుని త్యాగము

పాట్నాయందు బాబు శ్రీ గోవింద ప్రసాదుగారు తన యెస్టేటుసంతటిని నివాస గృహముతో సహా, తానుయెస్టేటులో కొన్ని సంవత్సరముల క్రితం ఆరంభించియుండిన గ్రామ పునరుద్ధరణోద్యమమునకు గాను యిచ్చివేయుచు ట్రస్టీడీడు వ్రాసెను. అందు తన కుటుంబ పోషణార్థము సంవత్సరమునకు రు 6000 లు మాత్ర మివ్వవలెననియు, యెస్టేటు ఆదాయము తగ్గిన యెడల తనకిచ్చు మొత్తమును కూడా తగ్గించవలెననియు, అభివృద్ధి గాంచిన హెచ్చించ నవసరము లేదనియు, ట్రస్టీలలో నొకరిని ప్రజలు యెన్నుకొన వలయుననియు వ్రాసెను.


## ఉపాసనా ప్రభావము.

మీ భవిష్యత్తులోని ప్రశ్నలకు దివ్య దృష్టివలన సరియైన సమాధానములను వ్రాసి వి. పి. పోస్టుద్వారా మీకు పంపుదుము. 5 ప్రశ్నలకు రూ. 1-4-0.
12 ప్రశ్నలకు రూ. 2-4-0.

మీ గృహముల యొక్కయు, పశుశాలలయొక్కయు, లేక నూతన స్థలములయొక్కయు ప్లానులను వేసిపంపిన వాట్టియొక్క బలాబలములును; అందు, వాస్తు, భూగర్భశల్య జలప్రయోగ పిశాచాది దోషము లున్నవో లేవో పరిశోధించిచూచి యుండినచో వాటికి శాంత్యాది విధులు మొదలగు ప్రతియంశములను విపులముగా మీకు తెల్పుదుము.

ఇందులకు వి. పి. ఖర్చులతో సహా చార్జి రూ. 2-4-0.

నవగ్రహ దోషములు తొలగుటకును ప్రయోగ లక్షణములు వీడిపోవుటకును భూత ప్రేత పిశాచముల బాధలు తొలగుటకును సమస్త వశీకరణాదులకును మహామంత్రయంత్ర తాయెత్తులుపంపుదుము.

అడ్రెస్:— "మాంత్రికచక్రవర్తి"
ప్రొఫెసర్ అజక్, ఎం. ఏ.,
అక్కట్టీప్పు, బెజవాడ.

# గోవిందరెడ్డీ!
# ఎంత ధన్యాత్ముడవోయీ!

సహృదయుండవగు గోవిందరెడ్డీ! ధన్యాత్ముడ వోయీ! దినదినము కన్నబెట్టు చున్నదోయి, నీ శాంత హృదయము. ఈశ్వర ప్రీతికెక్కిన వారు కష్ట పరంపరలకులోను గాక తప్పదు సుమా! నిన్ను బెట్టు కష్టములు వలచుకొన్న హిరణ్యకశిపుని హృదయమైనను కరగును గదోయి!

నీకు నోటీసైనను లేకచేసినయక్సపార్టి డిక్రీలను, కట్టవలసినదను లేని డిక్రీలకు, అమలుకు బెట్టి వందలాది సిపాయీలు, తహసీలుదారు, సిరస్తాదారు, అడవికోర, అడవిబంట్రోతులు, సబ్ మాజిస్ట్రేటు, డిప్యూటీసూపరింటెండెంటు, సబ్ యిన్‌స్పెక్టరు, రిజర్వు పోలీసులు, తుపాకులు, కట్టెలతో యిల్లు ముట్టడించి, ఒక నిమిషమైనను అవకాశమివ్వక, కొంపలో ప్రవేశించి కుండచట్టి బైటవేసి అవమాన పరచ నున్న నాడు చలించక సైతము కట్టివేసితివి.

కేసు నిమిత్తము గూడూరు రివిన్యూ కోర్టుకు రాగా కిస్తు డిక్రీ బాకీకి స్టాటు ఫారముమీద అరెస్టు చేసి అచ్చటకు 20 గజములలోనున్న కోర్టుకు గొని పోక బలవంతముగా వెంకటగిరికి లాగుకొని పోయి నగరిముందర పడవేసి అవమానపరచి నవ్వుకు లొంగ నైతివి.

రెడ్డిరాణి పత్రిక చదువుకొనుచు నీ కొంపలో పగలు పడుకొని యుండగా యెస్టేటు సిపాయిలును, పోలీసులును యింటిలో జొరబడి కట్టెలతో నీవు పడుకొన్న మంచపు పట్టె సైతము విరిగి పోవునటుల చావమోది జుట్టుపట్టుకొని అవుట్ పోస్టు వరకు వీధిలో తిరువాళ్ళ ప్రజలవలె చుట్టుకొని కన్నీట నీరాజనము లిచ్చుచున్న ప్రజల మధ్య బడ బడ యీడ్చుకొని పోయినపుడును నీ ధైర్యము మొక్కబడ దాయెను. నిన్ను అకారణముగా హింసించిన వారు వెంటనే శిక్షల ననుభవించిరి.

రామయ్య, రామన్న, దొరవారు అను నామాంతరములు గల జూపల్లి వెంకటాద్రిమారావుగారికి పోటీగా జిల్లాబోర్డుకు నీవు అభ్యర్థిగా వారి కండ్ల యెదుట నిలిచినంతటి పాపకార్యము జేసినందుకు చిత్తూరు జిల్లాలో ఒక రయితుకివ్వ వలసిన డిక్రీబాకీని రాజీపడి పరిష్కరించుకొను సమయమున సంస్థానపు కచ్చులతో డిక్రీఅములుకు బెట్టి నిన్ను అరెస్టుజేసి అవమానపరచ దలచి మాసము లాదిగా వారంటును చూపి భయపెట్టుచున్నను "ప్రఖ్యాత పురుషుడగు యెదిరి అభ్యర్థే అరెస్టు వారంట్లకు గురి యగుచున్నప్పుడు నాకేమి అవమానము" అని ధైర్యముతో నుంటివి. నీ ప్రత్యర్థి వలాని విషయమునకు యితరులకు వ్రాసియిచ్చిన ప్రోనోట్లను సైతము టాన్స్ఫరు చేసుకొనుచున్నప్పుడు ధర్మ మార్గమునే యవలంభించి ప్రతి పక్షులకు గుణపాఠము బోధించితివి.

జనవరి తే 8 ది నాడు నీ జిల్లాబోర్డు ఓట్లు లెక్కించునపుడు నిన్ను బహుమాన పురస్సరముగా గౌరవింప దలచి ప్రక్కవగల క్లబ్బులో అరెస్టు వారంటుతో ఆగినా నుండకొనిరట. నీవు అట నుండి యింటికిపోయి నది చూడక తర్వాత కలచెలుసుకొని వందలాది జనము అడవులవీద కంపిరి. నిన్ను వెదకుటకు కాయలోకవంక, సైకిలు లోకవంక, పదాతులొకవంక పరువెత్తిరి. సుమారు వేయి మంది యెస్టేటుద్యోగులు నీకై ప్రతియిల్లు, ప్రతిచెట్టు, ప్రతిగుంట, ప్రతిరొడ్డు వెదుక నారంభించిరి. యీ సైనికులకు కంటబడియున్నచో యే స్వర్గధామమున లేటు మహారాజాగారితో నేటి భీభత్సమును వర్ణించుచుందువో? ఆరాత్రి కల్యాణరావుగారి యింటిచుట్టు తెల్లవారులు పదాతులు కావలి గాచిరట. ఈ విషాదవృత్తాంతముల విన్నవారల హృదయములే కలగుండు పడుచుండ నీకెంత మనోవేదన గలిగించుచున్నదో ఈశ్వరునికే యెరుక.

పరోపకార చింతనమే నిన్ను గతికి తెచ్చినది. యెస్టేటు వారి మాటవిని జమీందారీ రయితు సంఘమును కైవల్య నదిలో గలిపియున్నచో నీకీపాటికి అత్యధిక మత్తికాపాత సంయుత సువాణ భోజనము లభించియుండునే! కాని నీబోంట్లకి ఆశలు తృణప్రాయములు.

ఓ స్వార్థత్యాగీ! మాకై నీవు పడుచున్న బాధలను కండ్లారజూచియు, చేయునదిలేమి, కన్నీటి జలముచే నిన్నారాధించుచున్నాము. తరములాది కృశించి కృశించి పోవుచున్న రయితు జాతికి మంచి దినములు రాబోవుచున్నవి. అప్పటి వరకు కొన యూపిరులతో బిగబట్టుకొని యుందము. ఆమహోత్తర దినమునకై మనము, మన పశుగణమును, ఈశ్వరుని పూజచేయుచుందము. ఆశుభోదయమున మీవంటి స్వార్థత్యాగుల కీర్తి చంద్రికలు లోకము నావరించగలవు.

ఇవియే మాయశ్రుపూరిత సానుతాపములు.

ఇట్లు,

"బాధలనుభవించు రయితు బృందము."

# విధురవిలాపము.

మ. వెలుగంపుంబువు దీశ కన్నియలనా
శ్లేషించి పెన్మక్కువన్
ఫలముల్ నిండిన కొమ్మచేతులను సం
స్పర్శించు భూజాతిచే
వలపుంగూర్చెడి పూవుతోటు కకటా
స్పర్శించె దీవక్షతుల్
వెలయింపంగల తోట్రుపాటుడకటుల్
క్రీడింపకో భృంగమా!

మ. తలపుల్ తామర తంపరై హృదయుకే
దారంబునన్ నిండగాం
దెలియన్ రాని వియోగదుఃఖములు వ్యా
పింపెంచి పీడింపగాం
వెలుగుజ్యోత్స్నల శోకబాష్పములచే
నీగింతు సెల్లిరకన్
తెలియారజ్వెదం జేస్పనిరసతికిన్
తెల్గింపు సాకోరకన్

మ. అమరాయె వెలుకంపు సేతగమిమా
హార్మ్యంబు నంది క్రతిన్
కులువంజాలను నీకుపేర్మికథల
న్నామగ్య పాగంబులన్
నిరతంబున్మదిలోన నీస్మరణము
స్నేంజేయు దునాత్మనై
కరుణాపాత్రిక దీపము ల్వెలుగగాం
గాన్పింపు క్రీనిదవ్వై.

తే. గీ. కమ్మపూదేనె వలపించు కమ్రవనము
పాలమీగడ తరకలం బరగు మేల్మి
క్రొత్త దిరిశపుపూవుల మెత్తదనము
నెనరు నీపల్కు బ్రాను నాహృదయవీణ

వ. నలుపవు పాపకార్యముల సత్యముబ
ల్కాడ వెల్లవేళల్
వెలిపిననాడు కోర్కెలను దీర్తువు వెంటనె
ప్రేమలూరగా
నెమ్మలంగాదు సత్క్రధారతిని నీవు "నిషేకము
నాటిసౌఖ్యముల్
దలతురె లంపునంబులను" తాత్విక
వేదులు వన్నునంబలేన్.

ఉ. కన్నుల కాంతి మాయగను
గల్గినాదము సన్నగిల్లగాన్
ఖిన్నతనిమ్మం జుట్టుకొని
కేవలమార్తిని బంధురేద్వగాన్
తెన్నెదిదైవమా యనుచు
దీనతనే విలపించుచుండగాన్
మిన్నులలోనం బోయితివె
నీదగుపున్నము తోడ్రదీర్ప గాన్

సీ. పెద్రియుండనే నయ్యును తినచిన బలుకవు
విబుధ వాద్యంబుల వినుచు నేమొ
కలలోల నైనను గాన్పింపం దలపవు
అస్పష్టలోకాన నలరుచేమొ
అనయమేర్చుచు నున్న అత్తినుజాడవు
సురనాట్యకౌశలి జూచుచేమొ
కనిపెద్దచేసిన జనయిత్రి దీర్పవు
త్రిదశకాంతల తోడదిరుగుచేమొ.

తే. గీ. అయినగోపించి నిన్నేమి యాడికొనము
మాఫలంబింతయేనని మాకుదోచె
ఆయురారోగ్య సంపదలందునట్లు
నీకు దేవుని దీవింపునిర్మలాంగి.

తే. గీ. అకనిద్రపు భీకరారాధ్యమైన
యంత్య సన్నాహమెట్లోకోయనుచుమదిడ
అప్పుడొక్కడు దయంజూపి యాదరించె
దైవమంపినతోడుగా దలచినన్ను.

వారణాశి సుబ్రహ్మణ్య శాస్త్రి
కస్తూరిదేవి విద్యాలయము.

నకలుమందులను చూచి మోసపోకుడు

నలుబది సంవత్సరములుగా ప్రఖ్యాతిజెందినది. కేవలము బాధసాధని.




తలనొప్పుల మాన్పును, వాయుపోటుల బాపును, పార్శ్వపు నొప్పుల పారదోలును, పొట్ల పోగొట్టును, తేలుకుట్ల ఖేదంబును, వాపుల రూపుమాపును, దగును తగ్గించును, దురదను తొలగించును.

మదాసు, మైసూరు రాష్ట్రములకు
మొత్తపు ఏజంట్లు,
హ్యాం అండు కంపెని,
6, బందరువీధి, మదాసు.

అమృతాంజనం డిపో,
మదాసు, బొంబాయి,
కలకత్తా.



## కృషీవలుడు

ఆంధ్రదేశ వ్యవసాయకుల పాలిటిసురభి
తిరుపతి జమీన్ రైతు మహాజన సంఘము
యాజమాన్యమున
1, 15 తేదీల వెలువడు పక్షపత్రిక.
సం॥ చందా 2 రూపాయలు మాత్రమే.
పత్రిక కార్యాలయము
నెం 6. లాయుక్ చిన్నతంబి మొదలివీధి:
సౌకార్ పేట, మద్రాసు.



## త్రివేణి

మత, సాంఘిక, ఆర్థిక, రాజకీయ పారిశ్రామిక విషయముల నిష్పక్షపాతముగ చర్చించు వార పత్రిక. సంవత్సర చందా రూ $2\frac{1}{2}$/- మాత్రము. వలయువారీ క్రింది చిరునామాకు వ్రాసి తెప్పించుకొనుడు.

మేనేజరు 'త్రివేణి' 323, హైరోడ్డు,
ఠండియార్పేట, మద్రాసు.



# గ్రాండ్ నేషనల్ స్వీప్ (లాటరీ)

ఐరిష్ హాస్పిటల్ ట్రస్టు లిమిటెడ్ వారిచే నడుపబడుచున్నది

24 మార్చి 1933 సం॥ తేదీని ఐన్ ట్రీ (ఇంగ్లాండు)లో పందెము జరుగును.

చందా, మామూలు మెంబరు తీ 2—2—33 సం॥ వరకు టిక్కెట్టు 1-కి రు 7—12—0 లు.

# లింకోలన్ షైర్ హ్యాండీక్యాప్ స్వీపులాటరీ.

మ్యాచుయల్ క్లబ్బు వారిచే నడుపబడుచున్నది.

22 మార్చి 1933 సం॥ తేదిని లింకోలన్ (ఇంగ్లాండు)లో పందెము జరుగును.

చందా, మామూలు మెంబరు తీ 22—2—33 సం॥ వరకు టిక్కెట్టు 1-కి రు 4—12—0 లు.

ఈపై రెండుక్లబ్బులటిక్కెట్లున్ను దిగువ విలాసదారుయొద్ద దొరుకును. గనుక సొమ్ముతో ఆర్డరుపంపుకోవచ్చును.

టి. వి. రెడ్డి,
అధికారమును పొందిన ఏజెంటు.

రాజమండ్రి (తూర్పు గోదావరిజిల్లా.)


సంపాదకుడు, ముద్రాపకుడు, ప్రకాశకుడు, నెల్లూరు, వెంకటాద్రిమానాయుడు, జమీందారీ రైతు ముద్రణాలయం, గాంధిచౌక్, నెల్లూరు.